క్లుప్తంగా

బీజేపీ మండలాల అధ్యక్షుల నియామకం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లాలోని మండలాలు, పట్టణాలకు పార్టీ అధ్యక్షులను నియమిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట టౌన్ అధ్యక్షుడిగా కోడూరి నరేష్, సిద్దిపేట అర్బన్ అధ్యక్షుడిగా కొండపాక వరప్రసాద్, సిద్దిపేట రూరల్ అధ్యక్షుడిగా అన్నసారం సురేష్ గౌడ్, చిన్నకోడూరు మండల అధ్యక్షుడిగా సూరగోని శేఖర్ గౌడ్, నంగునూరు మండల అధ్యక్షుడిగా చౌడుచెర్ల వెంకట్రామిరెడ్డి, నారాయణరావుపేట మండల అధ్యక్షుడిగా పొన్నాల బాబు, రాయపోల్ మండల అధ్యక్షుడిగా రాజాగారి రాజుగౌడ్, దౌల్తాబాద్ మండల అధ్యక్షుడిగా సురువుగాని భూపాల్ రెడ్డి, హుస్నాబాద్ టౌన్ అధ్యక్షుడిగా దొడ్డి శ్రీనివాస్, అక్కన్నపేట మండల అధ్యక్షుడిగా రామంచ మహేందర్ రెడ్డి, హుస్నాబాద్ అధ్యక్షుడిగా వెల్దండి రాజేంద్రప్రసాద్, చేర్యాల టౌన్ అధ్యక్షుడిగా మన్నె సత్యవర్ధన్, దూల్మిట్ట మండల అధ్యక్షుడిగా రచ్చ సంతోష్ కుమార్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

హుస్నాబాద్: హైదరాబాద్ సమీప శంకరాపల్లి మండలం జాన్వాడ గ్రామంలో ఇటీవల క్రైస్తవులపై జరిగిన దాడిని నిరసిస్తూ శనివారం హుస్నాబాద్‌లో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ ఇస్సాక్ మాట్లాడుతూ మందిరం విషయంలో చిన్న సమస్యను ఆసరా తీసుకొని క్రైస్తవులపై దాడికి పాల్పడ్డారన్నారు. దాడిలో 25 మంది గాయపడ్డారని, ముగ్గురు తీవ్ర గాయాలతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సాల్మాన్, మలాకీ, విజయ్‌కుమార్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ మంజూరుకు వినతి



వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హుస్నాబాద్: హుస్నాబాద్‌కు ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహాన్ని మంజూరు చేయాలని హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయ అధికారికి వినతి పత్రం ఇచ్చినట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెరిపోతుల జనార్ధన్, జిల్లా అధ్యక్షుడు సంగెం మధు శనివారం తెలిపారు. హుస్నాబాద్‌లో 13 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో సుమారుగా 350 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. వసతి గృహం లేక బీసీ, ఎస్టీ హాస్టల్‌లో ఎస్సీలకు సరిపడా సీట్లు లేక దూరప్రాంతాల నుంచి విద్యార్థులు నానా అవస్థలుపడుతూ కళాశాలలకు వస్తున్నారన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

మహిళలకు అండగా పోలీసు శాఖ



చట్టాల గురించి వివరిస్తున్న సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: మహిళలు, యువతులకు పోలీసు శాఖ అండగా ఉంటుందని సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ అన్నారు. శనివారం మిట్టపల్లి, ఎల్లుపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో విద్యార్థినులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్, సోషల్ మీడియా పరిణామాలు, డయల్ 100 ప్రాముఖ్యత, మహిళల, యువతుల రక్షణ చట్టాలు, నేరాలు, మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హర్షియా పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తు, ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తున్న వారిని వెంటనే విధుల నుంచి తొలగించాలని దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి కుంబాల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సిద్దిపేట అర్బన్ మండల విద్యాధికారి యాదవ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ప్రైవేట్ పాఠశాలలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు.

తండాలో తాగునీటి కటకట

ఐదు నెలలుగా భగీరథ బంద్

- ఎండిన పంచాయతీ బోరు
- వేసవికి ముందే తాగునీటికి కష్టాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



బంగారులొద్దితండాలో వ్యవసాయ బావి నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

తండాలకు తాగునీటి సమస్య తప్పడంలేదు. అప్పుడే వేసవి నీటి ఎద్దడి మొదలైంది. గిరిజనులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. బావుల్లో నీరు అడుగంటడంతో వ్యవసాయ బావుల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. వేసవి ఆరంభంలోనే పరిస్థితి తీవ్రంగా ఉంది. ఏప్రిల్, మేలో నీటి ఎద్దడిని ఎలా ఎదుర్కోవాలని ఆందోళన చెందుతున్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం రామవరం గ్రామపంచాయతీ పరిధిలోని బంగారులొద్దితండా, ఆర్అండ్ఆర్ కాలనీలో గుక్కెడు మంచినీటి కోసం గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. బంగారులొద్ది తండాలో 202 జనాభా ఉంటుంది. ముంపు గుడాటిపల్లి గ్రామ పరిధిలోని ఐదుతండాల గిరిజనులకు నందారం స్టేజి వద్ద ×ఆర్అండ్ఆర్ కాలనీ×ని ఏర్పాటు చేసి 185 మంది కుటుంబాలకు ప్లాట్లను చేసి గత ప్రభుత్వం ఇచ్చింది. బంగారులొద్దితండా, ఆర్అండ్ఆర్ కాలనీలు రెండు పక్కపక్కగా కలిసే ఉంటాయి. భూ నిర్వాసితులంతా ఇక్కడ ఇళ్లు నిర్మించుకుంటున్నారు.



తండాలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

చుక్క నీటి కోసం పరుగులు



పనిచేయని బోరు మోటారు

నిద్రలేచినప్పటి నుంచి తాగునీటి కోసం వ్యవసాయ బావుల వద్దకు పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్అండ్ఆర్ కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మించలేదు. దీంతో మంచినీళ్ల కోసం నిత్యం బావుల వద్దకు బిందెలు పట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే బంగారులొద్దితండాలో ఉన్న పంచాయతీ బోరుబావి ఎండిపోయింది. గత 5 నెలల నుంచి మిషన్ భగీరథ నీళ్లు రావట్లేదని తండావాసులు చెబుతున్నారు. కనీసం స్నానం చేసేందుకు కూడా నీళ్ల లేక మహిళలు వ్యవసాయ బావుల వద్దే స్నానాలు చేయాల్సి పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. ఏటా ఈ తండాల్లో వేసవి ప్రారంభం కాకముందే తాగునీరు కష్టాలు ప్రారంభం కావడం పరిపాటిగా మారిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాశ్వత తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడంలేదంటున్నారు. తండాలో రక్షిత వాటర్ ట్యాంక్ నిర్మించినా నిరుపయోగంగా ఉండటం వారు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి తాగునీటి సమస్య పరిష్కరించాలని తండావాసులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి అనూషను సాక్షి వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

వ్యవసాయ బావులే దిక్కు



వేసవి వచ్చిందంటే మాకు వ్యవసాయ బావులే దిక్కు. తండాలో మిషన్ భగీరథ ట్యాంక్ ఉన్నా ఫలితం లేకుండా పోయింది. తెల్లవారుజామున బిందెలు నెత్తిన పెట్టుకొని పొలం గట్లపైనుంచి వస్తున్నాం. పంచాయతీ, మండల అధికారులెవరూ పట్టించుకోవడంలేదు. గుక్కెడు మంచినీళ్ల కోసం పడరాని పాట్లు పడుతున్నాం. స్నానం కూడా వ్యవసాయ బావుల వద్ద చేయాల్సి వస్తోంది. తాగునీటి సమస్య పరిష్కరించాలి.

– ధరావత్ లక్ష్మి, బంగారులొద్దితండా



స్వయం పాలనలో పాల్గొన్న తొగుట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

తొగుట(దుబ్బాక): తొగుట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం ఘనంగా స్వయం పాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. తోటి విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. డీఈవోగా కీర్తన, డిప్యూటీ డీఈవోగా ప్రణయ్, ఎంఈవోగా భరత్, ఎంఎన్‌వోగా మనోహర్, హెచ్ఎంగా చందన, ఉపాధ్యాయులుగా మరికొందరు విద్యార్థులు, ఫిజికల్ డైరెక్టర్లుగా లింగం, షాదుల్లా, భరత్ విధులు నిర్వహించారు.

కొండపాక(గజ్వేల్): మండలంలోని అంకిరెడ్డిపల్లి హైస్కూల్లో శనివారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డీఈఓ మణిదీప్, హెచ్ఎంగా మమత, ఉపాధ్యాయులు శ్రావణి, మల్లేశ్వరి, హర్షిత, శ్రావణి, అంజలి, పుష్ప, అటెండర్లుగా స్వామి, రాములు వ్యవహరించారు. హెచ్ఎం గోపాల్‌రెడ్డి పర్యవేక్షించారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని మునిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా అరవింద్, డీఈఓగా రంజిత్, ఎంఈఓగా ఉపేందర్, హెచ్ఎంగా నిఖిత వ్యవహరించారు.



అంకిరెడ్డిపల్లి హైస్కూల్లో..



మునిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

ఆర్థిక సహాయం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం కూచనపెల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు రవీందర్ ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. అంత్యక్రియలకు బీసీ సంక్షేమ శాఖ నుంచి రూ.25 వేలు చెక్కు రూపంలో ప్రభుత్వం మంజూరు చేసింది. శనివారం గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ అధికారి మల్లేశం మృతుడి కుటుంబానికి చెక్కును అందజేశారు.

మొక్కల పరిశీలన

హుస్నాబాద్‌రూరల్: నర్సరీల్లో పెంచే మొక్కలు ఎండలకు వాడిపోకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం తోటపల్లి, గాంధీనగర్ గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు.

విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్



కుకునూరుపల్లి హైస్కూల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకుడు నరేందర్

దుబ్బాకరూరల్: తెలంగాణ బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో మండలంలోని హబ్సిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. లచ్చపేట మోడల్ స్కూల్ విద్యార్థి దీపక్ ప్రథమ స్థానం, గంభీర్‌పూర్ పాఠశాల విద్యార్థి విష్ణు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రభుదాస్, సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు సాదత్ అలీ మాట్లాడారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు.

హుస్నాబాద్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం సహదేవరెడ్డి మాట్లాడుతూ సైన్స్ నిత్య జీవితంలో ఎన్నో అవసరాలను తీరుస్తూ మానవ మనుగడకు ఎన్నో సౌకర్యాలు కల్పించిందన్నారు. సైన్స్ లేకుండా మానవ మనుగడ అసాధ్యమన్నారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బయోసైన్స్ ఫోరం అధ్యక్షుడు వెంకటరమణా రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు ప్రభాకర్ రావు, రత్నాకర్, సావుల రవీందర్, రాజయ్య, నేతాజీ, నరేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో శనివారం సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కొండపాకలోని హైస్కూల్లో నిర్వహించిన టెస్ట్‌లో ఖమ్మంపల్లి హైస్కూల్ విద్యార్థిని ప్రత్యూష పథమ స్థానం, సిర్సనగండ్ల హైస్కూల్ విద్యార్థి హేమ ద్వితీయ స్థానంలో నిలిచారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తాతో పాటు రాజీవ్ రహదారిపై పలు చోట్ల వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపరిచారు. శనివారం విచారణ జరిపిన జడ్జి శ్రావణి తొమ్మిది మందికి రూ.10 వేల జరిమానా విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు



బస్సును ప్రారంభిస్తున్న రఘునందన్ రావు

దుబ్బాక: అయోధ్య బాలరాముడి ఆశీస్సులతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయమని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. శనివారం దుబ్బాకలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం దుబ్బాక నుంచి అయోధ్యకు రామభక్తులతో వెళ్లే బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా నుంచి దాదాపు 1,450 మంది రామభక్తులు అయోధ్యకు వెళ్తున్నారన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): అయోధ్య బాలరాముడి దర్శనానికి తరలివెళ్తున్న బీజేపీ నాయకులు మిరుదొడ్డిలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గజ్వేల్‌రూరల్: అయోధ్యలోని బాలరాముడిని దర్శించుకోవడానికి గజ్వేల్ నుంచి రామ భక్తులు శనివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీసీతారామ ఉమామహేశ్వరాలయం నుంచి అయ్యప్ప దేవాలయం వరకు పాదయాత్రగా వచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య బాలరాముడిని దర్శించుకునేందుకు సుమారు 200 మంది వెళ్తున్నామన్నారు.

కేసీఆర్.. కారణజన్ముడు

ఘనంగా జన్మదిన వేడుకలు

- అభిమానుల ప్రత్యేక పూజలు



చిన్నకోడూరులో దేవాలయంలో పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, నాయకులు



సిద్దిపేటలో చర్చిలో ప్రార్థనలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



హుస్నాబాద్‌లో కేక్ కట్‌చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత



దుబ్బాకలో కేక్ కట్‌చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, జెడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కారణజన్ముడని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఆయన జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మోహినిపూర వెంకటేశ్వర ఆలయంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సంపత్‌రెడ్డి, కేవీఆర్ ఫౌండర్ కల్వకుంట్ల వంశీధర్‌రావు, బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, దర్గా వద్ద నమాజ్ చేశారు.

హుస్నాబాద్: హుస్నాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ ఎడబోయిన రజిని, కౌన్సిలర్ గూళ్ల రాజు, నాయకులు పాల్గొన్నారు.

దుబ్బాక: బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, జెడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి కేక్ కట్‌చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దుబ్బాక వంద పడకల ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం చిన్నకోడూరులో ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ ఆధ్వర్యంలో దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిచారు. భారీ కేక్ కట్ చేశారు. మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, సర్పంచ్ ఉమేష్ చంద్ర, ఎంపీటీసీలు శారద రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వాసవీ క్లబ్, వనిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేటలోని అభయజ్యోతి మానసిక వికలాంగుల పాఠశాలలో పరీక్ష సామగ్రి అందజేశారు. వాసవీ క్లబ్ సభ్యులు జూలూరి రాణి, జగదీష్ దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పుస్తకాలు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వనితక్లబ్ ప్రధాన కార్యదర్శి కొండూరి మాధవి, కోశాధికారి చింత రజని, మర్యాల వీరేశం, ఉపాధ్యాయుడు జోజి, తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్(దుబ్బాక): మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో బీఆర్ఎస్ అధ్యక్షుడు రణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడులు అందజేశారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): మండల పరిధి దుద్దెడ హైస్కూల్లో దివంగత ప్రభుత్వ ఉపాధ్యాయుడు గడీల బాలకిషన్ జ్ఞాపకార్థం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం లక్ష్మి మాట్లాడుతూ అన్ని దానాల కంటే విద్యాదానం గొప్పదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాకి చంద్రభాను, రజని, యాదగిరి, భారతి, హైమావతి, ఉమారాణి, ఏసుమణి తదితరులు పాల్గొన్నారు.

◆ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

సిద్దిపేటరూరల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, పీడీఎస్ రైస్ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ అపూర్వరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి ప్రభుత్వ అనుమతి లేకుండా సిద్దిపేటకు చెందిన కుంచం రమేశ్ తెర్లుమద్ది గ్రామం నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నారు. అలాగే శనివారం రాఘవాపూర్ వద్ద మరో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ రైస్ అక్రమంగా రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

◆ చట్టాలపై అవగాహన ఉండాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులు రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. శనివారం మండల పరిధిలోని రామంచ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మానవ అక్రమ రవాణా నిర్మూలన, గుడ్ టచ్, బాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యవతి, ఉపాధ్యాయులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

◆ కులగణన తీర్మానం భగీరథ నిర్ణయం

హుస్నాబాద్: అసెంబ్లీలో కులగణన చేపట్టాలని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదించడం భగీరథ నిర్ణయమని విశ్వకర్మ పరిషత్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంత వరకు ఏ ప్రభుత్వం సమగ్ర కులగణన నిర్వహించడానికి సాహసించలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను పట్టించుకోలేదన్నారు. 82 శాతం ఉన్న బీసీలను అధికారం, రాజకీయ ఆధిపత్యం కోసం వాడుకున్నారే తప్ప వారికి న్యాయం చేయలేదన్నారు. ప్రజల పక్షాన మంచి ఆలోచన చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

◆ బాధ్యతలు స్వీకరణ

కొమురవెల్లి(సిద్దిపేట): గతంలో కొమురవెల్లి ఎంపీడీఓగా పనిచేసిన కుమారస్వామి సిద్దిపేట రూరల్ మండలం ఎంపీడీవోగా డిప్యూటేషన్‌పై వెళ్లారు. కొమురవెల్లి ఎంపీడీవో అనురాధ నల్లగొండ జిల్లాకు బదిలీకావడంతో ఆయన మళ్లీ కొమురవెల్లి ఎంపీడీవోగా విధుల్లో చేరారు. శనివారం ఆయనకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తలారి కీర్తన శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

◆ సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని 2వ వార్డులో రూ.5 లక్షల ఎంపీ నిధులతో చేపడుతున్న సీసీ డ్రైనేజీ పనులను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, కౌన్సిలర్ లింగంతో కలిసి ప్రారంభించారు.

◆ ముస్తాబైన ఎల్లమ్మ దేవాలయం

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయం పంచమ వార్షికోత్సవానికి ముస్తాబైంది. ఈనెల 18 నుంచి 22 వరకు ఉత్సవాల నిర్వహణకు నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. 18న గ్రామ దేవతలకు బోనాలు, 19న కాటమయ్యకు బోనం, పుట్ట కమ్ముట, లందకు పోవుట, పుట్ట బంగారం తెచ్చుట, అమ్మవారికి గంగ స్నానం, గంగ తెప్ప, బియ్యం సుంకించుట నిర్వహించనున్నారు. అలాగే 20న పెద్దగటం పూజ, అమ్మవారికి బోనాల సమర్పణ, శ్రీరేణుకా ఎల్లమ్మ, జమదగ్ని మహాముని కల్యాణం, ఒడి బియ్యం సమర్పణ, గావురంగాలు, సరువు వేయుట, 22న గణపతి పూజ, స్వస్తి వాచనం, అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమార్చన జరుగుతాయన్నారు.

◆ డంపింగ్‌యార్డు పరిశీలన

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ డంపింగ్ యార్డును గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్యతో కలిసి మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి శనివారం పరిశీలించారు. యార్డులో ఎరువు తయారీ పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. వారి వెంట ఇంజినీరింగ్ సిబ్బంది కిష్టన్న, సిబ్బంది ఉన్నారు.

◆ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను శనివారం చేర్యాల పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ దామోదర్ మాట్లాడుతూ మండల పరిధిలోని కడవేర్గు శివారు వాగు నుంచి ఇసుకను రవాణా చేస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బంది ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కి తరలించారన్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరా బంద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేషనల్ హైవే పనుల కారణంగా 11 కేవీ, 33 కేవీ విద్యుత్ లైన్‌ల మర్పుతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట రూరల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ఎన్సాన్‌పల్లి, సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల, డీఎక్స్ఎన్ కంపెనీ, మిట్టపల్లి, ఎల్లుపల్లి లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

◆ వైద్యఖర్చులకు చేయూత

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కొండపాకకు చెందిన పులిగిల్ల కనకయ్య రెండు రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. క్షతగాత్రుడు సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం అతడిని భారత జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్ పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

◆ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ బహుమతి

నంగునూరు(సిద్దిపేట): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నంగునూరులో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో అక్కెనపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని జీల రక్షిత ప్రథమ బహుమతి సాధించింది. శనివారం ప్రిన్సిపాల్ రవీందర్‌గౌడ్, అధ్యాపకులు విద్యార్థినిని అభినందించి జ్ఞాపిక అందజేశారు.